# పాతసమస్య కొత్తపరిష్కారం



అమృతవల్లి, వై.

సుబ్బాయమ్మగారికి ముగ్గురు ఎదిగిన కూతుళ్ళు ఉన్నారు.

ఎదిగి చేతికందివచ్చికూడా అందనంత దూరంలో ఇద్దరు కొడుకులున్నారు.

అయిదుగురు సంతానం ఎదిగేందుకు, నాలుగక్షరం ముక్కలు నేర్చుకునేందుకు సర్వీసుని ఖర్చుపెట్టేసిన రిటైర్డ్ హెడ్ గుమాస్తా, భర్త నరసింహంగారున్నారు.

రిటైరవకముందు, అయిన తర్వాత కూడా ఆయన్ని విడవక వెన్నంటి వచ్చిన హౌసింగ్ సొసైటీలో ఎనిమిది వేల అప్పుఉంది. ఇవిగాక ఇంకా ఆడపిల్లల పెళ్ళిళ్ల సమస్య. పెద్దకొడుకు డిగ్రీ తెచ్చుకోడానికి చేసిన అప్పుతో పాటు లిస్టులో వ్రాయటానికి వీల్లేని చిన్న చిన్న సమస్యలెన్నో ఉన్నాయి. ఏ ఒక్క సమస్యకీ పరిష్కారం దొరక్కముందే, ఒక్క బాధ్యతా తీరకముందే భర్త రిటైరయిపోవటం సుబ్బాయమ్మగారికి నచ్చలేదు.

లేవటానికి ఓపికలేని ఆ రామారావుకింకా నాలుగు సంవత్సరాల సర్వీసుంది. మీరేమో ఊరికిముందే రిటైరయి కూర్చున్నారు. చాదస్తం కాకపోతే బళ్లో చేరేటప్పుడు వయస్సు తగ్గించి వ్రాసుకోవద్దూ. ఖర్మ! అంత తెలివేఉంటే ఇంకేం అంటూ రోజుకి అరడజనుసార్లయినా వాపోతూ ఉంటుంది.

ఇంకా ఎదిగిపోతున్న కూతుళ్ల వయసు గురించి, పెరుగుతున్న ధరలు, తరగని అప్పులు, పెరగని ఆదాయం గురించి భార్యాభర్తలు తీవ్రంగా ఆలోచించారు. పరిష్కారమార్గమైతే దొరకలేదుగానీ వంట్లో ఉన్న కాస్త శక్తీ ఖర్చయిపోయి నీరసం ముంచుకురావటంతో అలసటగా నిట్టూర్చారు. స్వాతి వానకోసం ముత్యపుచిప్పల్లా రాబోయే జి.పి.యఫ్.కోసం ఎదురుచూస్తూ కూర్చున్నారు. అనుకోని విధంగా అనుకున్న సమయానికి మూడువేలు ప్రావిడెంట్ ఫండు రావటమేకాకుండా, చాలా కాలంగా

అనుకుంటున్న సంబంధం కూడా ఒక్కసారే కుదరటంతో భగవంతుడిమీద భక్తివిశ్వాసాలు తిరుపతి కొండంత పెరిగాయి. మరో రెండువేల అప్పుతో పెద్ద కూతుర్ని అత్తవారింటికి తరిమివేసి తల తడుముకున్నారు. కొత్తగా చేసిన అప్పు తాలూకు వాయిదాలు రెండుసార్లయినా కట్టకముందే తాత, అమ్మమ్మ కాబోతున్నారని కబురువచ్చింది. ఆ కంగారు నుంచి తేరుకుని తేలికపడేసరికి నెలలు నిండి కూతురు పుట్టింటికి రానేవచ్చింది. మరో రెండు మూడు వందల అప్పుతో మనవడు పుట్టాడు. బారసాలకొచ్చిన బంధువులు రెండవ కూతురు వయసుని గుర్తుచేసి ఇంకా ఎదిగిపోతే లాభంలేదని ఉచిత సలహాలిచ్చి వెళ్ళారు. అప్పటికే నిండా మునిగిపోయిన భార్యాభర్తలకి వాళ్ల సలహా గురించి ఆలోచించే ఓపిక లేకపోయింది. నిజానికి నిండా మునిగిన వాళ్లకి చలి ఉండకూడదు. కాని, మునిగి చచ్చిపోయాం. ఇంకా ఉండటం లేకపోవడం ఏమిటి అనుకున్నారు.

మనిషికి చేతకాని పనులని, పాపాలని నోర్మూసుకుని నెత్తిన వేసుకునే సర్వాంతర్యామి ఒకడున్నాడు కనుక 'అంతా వాడి దయ మనదేం ఉంది' అంటూ వేదాంతధోరణిలో నిట్టూర్చారు తల్లి-తండ్రి. అలా అనుకోవటం సుధకి నచ్చలేదు. ఆ యింట్లో ఏమటివారి మాటకి విలువ ఇవ్వాలనే నియమంలేదు. కనుక ఈ రోజుల్లో ముప్పయివేలు ఖరీదుచేసే యిల్లు అమ్మేసి హౌసింగ్‌బోర్డ్‌లో అప్పు తీర్చేసి, మిగిలిన డబ్బుతో కనీసం ఒక అల్లుడినైనా కొనుక్కోవచ్చనే స్వాభిప్రాయాన్ని మనసులోనే పదిసార్లనుకుని ఊరుకుంది.

సుధకి నచ్చనివి ఆ యింట్లో ఇంకా చాలా ఉన్నాయి. అన్నిటికంటె ముఖ్యమైనవి నెలనెలా అన్నల దగ్గర్నుంచి రాబోయే ఎమ్.ఒ.ల కోసం ఎదురు చూడటం. ప్రతినెలా అవి వచ్చేలోపల కనీసం ఒక వారంరోజులైనా పస్తులుండటం, అది వచ్చిన గంటలోనే అప్పులవాళ్లువచ్చి తన్నుకుపోవటం, మిగిలిన డబ్బుతో నెలసరి బడ్జట్ తయారుచేసుకోవటం, రాబోయే రెండో అల్లుడికి క్లాసు ఫోర్‌కి చెందని గవర్నమెంటు ఉద్యోగం, పూర్తిగా దానిమీదే ఆధారపడకుండా వెనక కొంచెం ఆస్తి గాని అయినవారు, పెళ్ళిళ్ళు కావల్సిన తోబుట్టువులు లేని వరుడు మూడువేలకే రావాలనే తల్లిదండ్రుల కోరికల్లాటివే ఎన్నో ఉన్నాయి వాటిని బయటకు చెప్పటానికి వీలు ఉన్నా విలువలేదు కనుక చెప్పలేదు.

సుబ్బాయమ్మగారికి నచ్చనివి, కూతుళ్ళకి విసుగు కలిగించేవి చాలా సంగతులున్నాయి. ఎస్సెల్సీతో చదువాపేసి ఉద్యోగం, సద్యోగం - ఒక సినిమా, షికారులాంటి సరదాలకి నోచు

కోని జీవితంమీద కూతుళ్లు విసుక్కుంటే సుబ్బాయమ్మగారు చర్రున లేస్తారు. "కొంచెం ఓపికపట్టండి, అన్ని సరదాలూ తీరతాయంటుంది. ఆ ఓపిక ఎన్నాళ్ళు పట్టాలో. పడితే లభించేదేమిటో మొదలైన ప్రశ్నలకి తల్లి దగ్గర జవాబులేదని తెల్సినా విని ఊరుకునే సహనం సుధకి లేదు కడుపున పుట్టిన బిడ్డలు మాట్లాడేది న్యాయమే అయినా అలా ఎదురు తిరగటాన్ని సుబ్బాయమ్మగారు సహించలేదు.

తల్లీ కూతుళ్ళమధ్య భేదాభిప్రాయాలు రానేకూడదు. వచ్చాయంటే ఆ యిల్లు నరకానికి మోడల్‌గా తయారవుతుంది. నెలనెలా క్రమం తప్పకుండా వచ్చి పలకరించే హౌసింగ్ బోర్డు వారి నోటీసుల గురించి నాలుకుర్చీలో పడుకుని ఎడతెగని ఆలోచనల్లో మునిగి ఉండే నరసింహంగారికి తల్లీ కూతుళ్ళ మధ్య రాజీ కుదిర్చే ఓర్పూ, శక్తీ లేవు.

కాలంనాడు గవర్నమెంటు వారిచ్చిన మూడెకరాల పర్రని మూడువేలకైనా అమ్మేసి గుండెలమీద కుంపట్లలో ఒకదాన్ని ఆర్పేసుకోవాలని సుబ్బాయమ్మగారి ఆరాటం ఆ చవిటి పర్రకి ముష్టి మూడువేలు కూడా ఎవరిస్తారని నరసింహంగారి ఆక్రోశం. అవేమీ పట్టనట్లు సాగిపోతున్న కాలప్రవాహంలో కరిగిపోతున్న కలల్ని కాపాడుకోవాలనే సుధ తాపత్రయం. ఆ ముగ్గురి ఆరాటాలకి, ఆక్రోశాలకి, తాపత్రయాలకి నవ్వుకుంటూ జీవితం బ్రతకటంకోసమే అన్నట్లు బ్రతికేస్తున్న లావణ్య చూసే వాళ్ళకి విరాగినిలా కనిపిస్తుంది.

"మరీ జ్యోతిలక్ష్మిలా కాకపోయినా కాస్త చలాకీగా చురుగ్గా ఉండాలి. ఇలా బుద్ధూలాగ ఉంటే అరవై దాటిన ఆరో పెళ్ళివాడికి కూడా నచ్చవు" అంటుంది సుధ.

"అభిమాన హీరోయిన్‌లాగ తయారైనా కోరిన కట్నం ఇవ్వలేకపోతే కోతిలాగే కనిపిస్తాం. కాసుకోసం పడిచచ్చేవాడికి నచ్చాలని ఆరాటపడటం దండగ" అంటుంది లావణ్య.

"అది సరే కాని చిన్నక్కా, నువ్వు పూజలు చేసేది దేనికోసం" కవ్వించటానికి మరో సంభాషణలోకి దిగింది సుధ.

"అందరూ దేనికోసం చేస్తారో నేనూ దానికోసమే."

"పూజలు చేస్తే పెళ్ళవుతుందనే నమ్మకం నీకుందా ?"

"బావుంది నీ ప్రశ్న. నేను చేసేది పెళ్ళికోసమేనని నమ్మకమేమిటి ?"

"దాంట్లో నమ్మకం కుదరనిదేముంది. ఈ వయసులో ప్రతి ఆడపిల్లా అదే కోరుకుంటుంది !"

"అయితే, నువ్వూ అదే కోరుకుంటున్నావా ?"

"తప్పులేదుగా..."నవ్వింది సుధ.

"నీకు పెళ్ళిచేస్తారనే నమ్మకం ఉందా చిన్నక్కా" రెండు నిమిషా లాగి అంది.

"ఎవరు, దేవుడా ?"

"ఊహూ. అమ్మ నాన్న."

దువ్వెనతో చిక్కు తీసుకుంటూ మౌనంగా ఉండిపోయిన లావణ్యవైపు చూసి నవ్వింది సుధ.

"అమ్మ, నాన్న ఒకరి అసమర్థతని మరొకరు ఎత్తి చూపించుకోడానికి, నిత్యం కీచులాడుకోటానికి, ఈ యింట్లో దారిద్ర్యమే కాని మరోదానికి స్థానం లేకపోటానికి కారణం ఏమిటో తెలుసా చిన్నక్కా ?"

"అప్పేకాని ఆస్థి లేనిచోట మనం ఆడపిల్లలుగా పుట్టడం."

"కరక్ట్. మనకి పెళ్ళిళ్ళయి ఎవరి దారిన వాళ్ళు వెళ్ళిపోతే కాని ఈ సంసారం బాగుపడదు. అవునా ?"

"అలా బాగుపడే గీత అమ్మ నాన్నకి లేదేమో !"

"గీత, రాతలేనిది వాళ్ళకి కాదు. మనకే. పాతికేళ్లు నిండుతున్న నీవు, దానికి దగ్గరలో ఉన్న నేను పరిస్థితుల నర్థం చేసుకోలేని పాపాయిలం కాదు. ఎవరి బ్రతుకుని వాళ్లు స్వయంగా తీర్చి దిద్దుకోగలిగే వయసు, జ్ఞానం ఉన్నాయి."

"ఇప్పుడివన్నీ ఎందుకు. అవతల వంటవలేదని అమ్మ కోప్పడుతుంది !",

"రోజూ ఉండే దీవెనలకి భయపడ్డా వెందుకు. ఉన్నదాంట్లోనే వండు కోవటం తినటం, అదీ లేకపోతే కళ్లు మూసుకుని పడుకోవటం, ఎమ్. ఓ. లు సరిగ్గా పంపటంలేదని అన్నయ్యలమీద విసుక్కోవటం, అప్పులవాళ్ళమీద విసుగు మనమీద చూపించటం...అబ్బ! జీవితం ముళ్ళకంపలా ఉంది కదు చిన్నక్కా ?"

"ఇప్పుడు క్రొత్తగా ఉన్నదేముంది. ఎప్పుడూ ఉండేదేగా !"

"అవునుగానీ నేనొకటి అడుగుతాను నిజం చెప్తావా ?"

జడ అల్లుకుని దువ్వెన టేబుల్‌మీద పెడ్తూ ఊఁ అంది లావణ్య.

"నీకు రామ్మూర్తంటే ఇష్టమే కదూ ?"

ఉలికిపాటుతో వెనక్కి తిరిగింది లావణ్య.

"చెప్పు, నేనెవరితో చెప్పనులే...? హామీ ఇచ్చింది. మౌనం అంగీకార సూచకంగా తలవంచుకున్న చిన్నక్కని చూసి నవ్వుకుంది సుధ.

"రామ్మూర్తికి మన పరిస్థితులమీద సానుభూతి ఉంది. సహాయపడాలనే తహతహ ఉంది. కష్టసుఖాల్ని అర్థం చేసుకోగల సహృదయం ఉంది. ఎదుటి మనిషి మాటకి విలువనిచ్చే సంస్కారం ఉంది. పదివేలిచ్చినా రామ్మూర్తి లాటి



వాడు దొరకటం అసాధ్యం. నువ్వతణ్ణి పెళ్ళిచేసుకో చిన్నక్కా."

అదిరిపడింది లావణ్య.

"నువ్వేమంటున్నావో తెలుస్తోందా నీకు?"

"ఏం? పిచ్చిదాని మాటల్లా ఉన్నాయా?"

"అవును. మతున్న దానివైతే అలా అనవు. నేనతణ్ణి చేసుకుంటే అమ్మా నాన్న విషంత్రాగి చస్తారు."

"మనకి పెళ్ళిళ్లు చేయగలిగే స్థితిలో లేమని గ్రహించినపుడే సగం చచ్చి పోయారు. పాతికో పరకో పంపించే పెద్దన్నయ్య, పండకి తక్కువకాకుండా పంపించే చిన్నన్నయ్య ధరలు పెరిగిపోయినయి కనుక ఇకమీద ఆ మాత్రం కూడా పంపించటం కష్టమే అన్నపుడు మిగిలిన సగం ప్రాణం పోయింది. ఒకసారి చచ్చినవాళ్లు ఇంకా ఏంచస్తారు?''

"ఏమో బాబూ, ఆ పనేదో నువ్వే చెయ్యి. నాకాధైర్యం లేదు,'' అంటూ గదిలోంచి వెళ్ళిపోయింది లావణ్య. చిన్నగా నిట్టూర్చి మంచం దిగింది సుధ. ఇంటిముందునుంచి వెళ్తూ కిటికీలోంచి

తనవైపుచూసి సంకేతంగా చెయ్యి ఊపుతున్న రాజుని చూడగానే ప్రాణం లేచి వచ్చినట్లయింది. ఆమె అభిప్రాయాల్ని, ఆరాటాన్ని, ఆవేశాన్ని అర్థం చేసుకుని విలువ ఇచ్చే వ్యక్తి అతనొక్కడే. గబగబ స్నానంచేసి, జడ అల్లుకుని బొట్టుపెట్టుకుని తయారయింది సుధ. ప్రక్క వీధిలో కమల దగ్గరకు వెళ్తున్నానంటూ జవాబు కోసం చూడకుండా వీధిలోకి వచ్చింది.

సెంటర్‌లో నిల్చున్న రాజు ఆమెను చూసి ముందుకు నడిచాడు. ఇద్దరూ విడివిడిగా నడుస్తూ మున్సిపల్ పార్కు చేరుకున్నారు.

"ఎప్పుడొచ్చారు ఊర్నించి" గన్నేరు చెట్టుక్రింద అతని కెదురుగా కూర్చుంటూ అంది.

"నిన్నే వచ్చాను. వెంటనే కలుసుకోటానికి వీల్లేకపోయింది." అది సరే, లావణ్యకి నేను వెళ్ళేటప్పుడు ఏదో సంబంధం చూస్తున్నారు ఏమయిందది?"

"ఏమీ కాలేదు. నీకు పెళ్ళిచేసుకోవాలని ఉంటే రామ్మూర్తిని చేసేసుకోమని లావణ్యకి సలహా ఇచ్చాను. వట్టి పిరికిది. మరో రెండు జన్మలెత్తినా దాంతో ఆ పని చేయించలేం."

"అందరూ నీలాగ అనుకున్నావా?"

"ఊహూ...మీలా అనుకున్నాను" ఇద్దరూ నవ్వుకున్నారు.

"ఇంకేమిటి విశేషాలు? రెండు క్షణాలాగి అన్నారు."

"అక్క మళ్ళీ ఇంటికివచ్చి వెళ్ళింది. రెండువందల అప్పుని మాకు మిగిల్చి కూతుర్ని ఎత్తుకుని వెళ్ళింది."

"ఈ ఆడపిల్లలకి పుట్టింటిని దోచుకోవటం తప్పితే వేరే పని ఉన్నట్లు లేదే."

"మీ మగ మహారాజు తెగ సంపాదించి అమ్మా నాన్న చేతుల్లో పోసేస్తుంటే దోచుకోక ఏంచేస్తాం?"

"పోనీ, నువ్వేదైనా ఉద్యోగంలో చేరకూడదూ?" నవ్వి సాలోచనగా అన్నాడు.

"వెదికి రెడీగా పెట్టినట్లు మాట్లాడతారెందుకు? గ్రాడ్యుయేట్స్‌కే ఉద్యోగం దొరకటం కనా కష్టంగా ఉంది. ఎస్సెల్సీ పాసన్‌కి ఎవరిస్తారు. అన్ని ప్రయత్నాలూ అయ్యాకే నోర్మూసుకుని ఇంట్లో కూర్చున్నాను. అంతదాకా ఎందుకు, మీరీ ఉద్యోగంకోసం ఎన్నెన్ని శ్రమపడ్డారో గుర్తుతెచ్చుకోండి."

"మర్చిపోగలిగితే కదా గుర్తుతెచ్చుకునేది. అయితే మీ సమస్యలకి పరిష్కారమార్గం లేనట్లేనా?"

"అమ్మా వాళ్ళ దృష్టిలో అయితే లేనట్లే కాని నా దృష్టిలో ఒకే ఒక మార్గం ఉంది."

"నాకు తెల్సు అదేమిటో. లావణ్య




రామ్మూర్తిని, సుధారాణి ఈ నాగరాజుని పెళ్ళిచేసుకోవటం...'

"పొరపాటు మిస్టర్. అలా జరిగితే అమ్మా నాన్న విషంత్రాగి చచ్చిపోతారు!"

"మరెలా జరిగితే అది త్రాగటం మానేస్తారో తెల్సా నీకు!"

"తెలియనివాటి గురించి నేనెప్పుడూ మాట్లాడను. ఆ విషమేదో నేను, లావణ్య త్రాగేస్తే ఏ గొడవా ఉండదు. ఇల్లు అమ్మేయటమో, లేకపోతే అప్పుతో పాటు ఇంటిని కూడా పంచేసుకుని అమ్మ నాన్నల్ని అన్నయ్యలు తీసుకెళ్ళిపోవటమో చేస్తారు."

సుధ స్వరంలో వినిపించిన ఆవేదనకి చలించాడు రాజు. ఇద్దరిమధ్యా సంభాషణ మరి సాగలేదు. నిశ్శబ్దంగా లేచి ఇంటిదారి పట్టారు.

"రాజు మీరు నాకో మాటివ్వాలి." గేటు దగ్గర ఆగి హఠాత్తుగ అంది.

"అడుగు."

"పెళ్ళిచేసుకోవటం, పిల్లల్ని కనటం మాత్రమే తెలిసిన వదినలు, కన్నవారి బాధ్యతని ఎంత త్వరగా వదుల్చుకుందుమా అని చూస్తున్న అన్నయ్యలు మేము మీరు చెప్పినట్లు పెళ్ళిళ్ళు చేసుకుంటే అమ్మా నాన్నలే దానికి కారణంగా నిందిస్తారు. ఆ మాత్రంగా కూడా చూడటం మానేస్తారు. అందుకని నేను, అమ్మ పెద్దన్నయ్య దగ్గరికి, నాన్నగారు, చిన్నక్క చిన్నన్నయ్య దగ్గరికి వెళ్ళిపోతే బావుండుననిపిస్తోంది.

ఎలాటి స్పందనా లేని ఈ జీవితం చాలా విసుగ్గా ఉంది వదినల దగ్గర ఉండటం కత్తిమీద సాములాంటిదే అయినా తప్పదు!"

''మరి నా సంగతి ?''

"నచ్చిన అమ్మాయిని బుద్ధిగా పెళ్ళిచేసేసుకోవటం !" నవ్వబోయింది కాని కళ్ళలో నీళ్ళు తిరిగాయి

''ముందే ఎందుకు చెప్పలే దీ విషయం ? ఈ మాట చెప్పటానికేనా నీ చుట్టూ తిప్పుకున్నావ్ ?"

''క్షమించండి. మీ మనసు కష్టపెట్టి నట్లున్నాను " బాధగా చూసింది

ఒక్క క్షణం ఆమె కళ్ళలోకి చూసి చరచర వెనక్కి తిరిగి వెళ్ళిపోయాడు రాజు.

"కళ్ళు తుడుచుకుని ఇంట్లోకి నడిచింది సుధ గదిలోకి వెళ్లబోయిన ఆమె కాళ్లకి వంటింట్లోంచి వినిపిస్తున్న సుబ్బాయమ్మగారి వాగ్ధోరణి బంధాలు వేసింది."

"తినో తినకో గుట్టుగా ఇంట్లోపడి ఉండటానికి లేకుండా పరువంతా బజారు కెక్కించేస్తున్నారు. నా కడుపున చెడ బుట్టారు. ఛీ ... లోకంలో ఎంతమంది లేరు, పెళ్ళిళ్ళు లేకుండా నీతిగా బ్రతికే వాళ్ళు. నా కర్మే ఇలా కాలింది. ప్రక్క వీధి రాజమ్మ కూతురికి ఏం తక్కువని. కానీ కట్నంలేకుండా చేసుకుంటామని వస్తున్నా వద్దని ఉద్యోగం చేసుకుంటూ ఉండిపోలేదూ ?"

"నిక్షేపంలా ఉండిపోయిందమ్మా. పైకి కనిపించేది మనిషి కాని మనసు కాదు "

ఆమె ఎందుకలా ఉండిపోయిందో అందరికీ తెల్సు. ప్రేమించినవాడిని చేసుకుంటానంటే తల్లీ తండ్రీ నుయ్యో గొయ్యో చూసుకుంటామని బెదిరించారు. మీరు ఇవ్వగలిగే కట్నానికి సరిపడే మనిషిని వెదుకుతారు కాని మేము వెదుక్కునేది నచ్చిన మనసు కోసం. స్త్రీ జీవితంలో ఒక్కరినే ప్రేమించగలుగుతుందని ఆడదానివైన నీకు చెప్పక్కర్లేదు. ఆ రాజమ్మ కూతుర్ని మెచ్చుకుంటున్నావే కాని ఆ అమ్మాయి పడుతున్న ఆవేదన ఎవరికి తెల్సు ? కన్నెమనసులో కన్నీటి విలువ ప్రతి రాత్రి తడుస్తున్న ఆమె తలక్రింద దిండుకి తెలుసు. పెదవులమీద చిర్నవ్వు వెలిసినా మనసులో హాలాహలం మరుగుతోందని ఎవరు గ్రహిస్తారు? కోరికల్ని చంపుకుని, కలల్ని కన్నీళ్ళలో కడిగేసుకు జీవచ్ఛవంలా బ్రతికిఉంటే చాలు. మీకదే సంతృప్తి...సంతోషం !! ఆవేశంగా అంది సుధ. సుబ్బాయమ్మగారి నోటికి హఠాత్తుగా తాళంపడింది. ధైర్యంగా మరో అడుగు ముందుకువేసి తల్లి దగ్గరిగా నిల్చుంది సుధ.

"చూడమ్మా, మేము సుఖపడడమే నీవు కోరుకున్నట్లయితే ఒక పనిచేయి. లావణ్యంటే రామ్మూర్తికి, నేనంటే రాజుకి ప్రాణం. వాళ్ళిద్దర్నీ మించిన

వరుల్ని మీరు తేగల్గితే, ఆ నమ్మకమే నాకుంటే ఈ సలహా ఇచ్చే అవసరం ఉండేది కాదు. అటు ప్రేమించినవాళ్లు, ఇటు మీరు, మరోప్రక్క మన పరిస్థితులు ... ఈ సంఘర్షణలో మా మనసులెంత నలిగిపోతున్నాయో ఆలోచించు..."

కూతురిస్తున్న సుదీర్ఘ ఉపన్యాసాన్ని ముందు గదిలో వింటున్న నరసింహంగారు నరసింహమూర్తే అయాడు. లేచి ఒక్క అంగలో సుధ ఎదుటికి వచ్చారు.

"నోర్మూయ్. పెద్దా-చిన్నా లేకుండా వాగటం నేర్చుకున్నావు. ఇంటికి శని గ్రహంల్లాగ దాపురించింది చాలక వెధవ ఆలోచనలు. ఏమే కూతురు ఉపన్యాసం అంత బావుందా. అంతగా అయితే అంతా కలిసి ఏ గంగలోనో దూకి చావండి! అంతేకాని పరువు రచ్చ కీడ్చకండి."

అసలు పరువంటూ ఉంటే కద నాన్నా అలా చేయటానికి. అప్పు తీర్చలేదని ఏదో ఒకరోజున ఈ యిల్లు వేలం వేసేస్తారు. అప్పుడు మన బ్రతుకులు చెట్టుక్రింద ముష్టివాళ్లకంటె హీనం అవుతాయి. అదే మీకు పరువైతే సరే. ఇలాగే ఉందాం."

"సుధా..." ఎత్తినచేయి సగంలోనే దింపేసి ఏదో గొణుక్కుంటూ ముందు గదిలోకివెళ్లిపోయారునరసింహంగారు. స్తబ్దుగా కూర్చుండి, పోయిన సుబ్బాయమ్మగారివైపు ఒక్క క్షణం చూసి గదిలోకి వెళ్ళింది సుధ.

సగం రాత్రి గడిచింది. అయినా ఆ యింట్లో నిద్రాదేవతకి ఆహ్వానం లభించలేదు.

"ఏమంటావ్. నా సలహా ప్రకారం చేస్తే ఏ గొడవా ఉండదు."

"నేనూ అదే నిర్ణయించుకున్నాను. ఇంకా ఆలస్యమెందుకు. లేవండి" అన్నారు. భర్తతో ఏకీభవిస్తూ సుబ్బాయమ్మగారు.

"నువ్వేమంటావ్ లావణ్యా. నీకింకా ఆశ ఉందా? మరో గదిలో చిన్నక్కని ప్రశ్నించింది."

"అలాటిదేమీ మొదట్నించీ లేదు. ఈ పని చేద్దామని ఎప్పట్నించో అనుకుంటున్నాను. కాని ధైర్యం చాల్లేదు."

"ఇప్పుడు నేను తోడు ఉన్నాగా, రా ఆలస్యంచేస్తే అమృతం విషం కాకుండా పోతుందేమో!"

నలుగురి మాటలు పొంచివింటున్న నిశాకన్యకి జరుగుతున్నదేమిటో అర్థం కాలేదు. అర్థంచేసుకునే లోపల భళ్ళున తెల్లవారిపోయింది.

"హౌసింగ్ సొసైటీవారి వేలం నోటీసు చూసుకుని మిగిలిన డబ్బు పంచుకోడానికి వచ్చిన సుబ్బాయమ్మగారి ఎదిగిన ఇద్దరు కొడుకుల్ని చూసి నలుగుర్ని పొట్టన పెట్టుకున్న మృత్యుదేవత వికటంగా నవ్వింది.